పేకాట రాయుళ్లను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గ్రామానికి చెందిన 10 మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని పక్కాసమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు, పేకాట స్థావరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ.వెంకటేశం ఆదివారం తెలిపారు.వారి వద్ద నుండి 9070 రూపాయలు, 9 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు, ఒక ఫోర్ వీలర్, 3 ఎలక్ట్రిక్ వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను, పట్టుబడిన వ్యక్తులను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 1

సోమవారం 17 జులై 2023

నూతన గడ్డి మందు ఆవిష్కరణ

నవతెలంగాణ - ముప్కాల్



ప్రస్తుతం వరి పంటలో వస్తున్న కలుపు సమస్యలను నివారించడానికి పారిజాత కంపెనీ వారు నూతన గడ్డి మందు 'ధావన్' ను మండలంలోని నాగంపేట్ గ్రామంలో రైతుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగంపేట్, రెంజర్ల రైతులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఇంఛార్జి శ్రీనివాసులు రైతులకు నూతన గడ్డి మందు 'ధావన్' యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఇంఛార్జి శ్రీనివాసులు, కంపనీ ప్రతినిధులు అరుణ్ బాబు, బాలచందర్, ప్రభాకర్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు..

మిషిన్‌కు మూడు వేలు

- మహిళల స్వయం ఉపాధిలో అక్రమాలు
- కమీషన్‌ల కోసం ఏజెంట్‌తో కుమ్మక్కైన ఏపీఎం..?
- యంత్రాలు అంటగట్టి పరార్ అయిన ఏజెంట్
- కిస్తీలు ఎలా చెల్లించాలో అర్థం కాక మహిళల ఆందోళన





నవతెలంగాణ-ఏర్గట్ల

తమ కుటుంబాలను ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు మహిళా సంఘాలకు చెందిన మహిళలు స్వయం ఉపాధిలో భాగంగా ఏదో ఒక లోన్‌ను తమతమ సంఘాల నుండి తీసుకుని తమ అవసరాలకు డబ్బులు వినియోగించుకుని నెల నెల డబ్బులు చెల్లిస్తారు. ఇందులో భాగంగానే ఏర్గట్ల మండలానికి చెందిన కొందరు మహిళలు స్వయం ఉపాధి పొందడానికి దూప్ మిషిన్లు, వత్తుల మిషిన్లను 80 వేల రూపాయలు లోన్ ద్వారా తీసుకుని వాటిని తయారు చేసి ఇస్తూ వచ్చిన డబ్బులతో నెల నెల కిస్తీలను చెల్లిస్తున్నారు.

ఇదిలా ఉంటే అందులో పనిచేసే ఏపీఎం కమీషన్ల కోసం కక్కుర్తి పడి తనే ఒక ఏజెంట్‌ను నియమించుకుని తన ద్వారా మిషిన్‌లను, ముడిసరకును తెప్పించి మండలంలో స్వయం ఉపాధి పొందాలనుకున్న మహిళలకు అంటగట్టడం ప్రారంభించాడు. అందుకు గాను ఏజెంట్ నుండి అధికారి ఒక్కో మిషన్‌కు సుమారు 3 వేల రూపాయల కమీషన్ తీసుకుంటున్నట్టు సమాచారం. సదరు అధికారి కమీషన్ల దాహానికి బిత్తరపోయిన ఏజెంట్ గత నాలుగు నెలల నుండి గ్రామాల్లోకి రాక వారికి డబ్బులు చెల్లించక, ముడిసరకును ఇవ్వకపో వడంతో మహిళలు మోసపోయామని గ్రహించారు. ఏజెంట్ పరారీలో ఉండడంతో పని చేసిన డబ్బులు రాకపోవడంతో ఉపాధి పొందుతున్న సభ్యులు నెలనెలా కిస్తీలు ఎలా కట్టుకోవాలో అర్థం కాక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనిలో భాగంగా ఏజెంట్ వారానికి ఒకసారి గ్రామాల్లోకి వచ్చి స్వయం ఉపాధి పొందుతున్న సభ్యురాళ్ళకు 20 కిలోల చొప్పున సాంబ్రాణి కప్పులు తయారు చేసే పిండి ఇస్తారు. కిలో పిండి ద్వారా కప్పులు గాని, వత్తులు గాని తయారు చేస్తే సభ్యురాలుకు ఏజెంట్ కిలోకు 100 రూపాయలు చెల్లించడం జరుగుతుంది. ఈ విధానంలో సభ్యురాళ్ళకు ఏజెంట్ కు 3 సంవత్సరాల అగ్రిమెంట్ ఉంటుంది. ఇదిలా ఉంటె ఏపీఎం కు ఇచ్చే కమీషన్లు ఎక్కువవడంతో ఏజెంట్‌కు గిట్టుబాటు కాక, మహిళలు తయారుచేసిన సాంబ్రాణి కప్పులు, వత్తులు తీసుకొని పోవడం లేదని తెలిసింది. మహిళలు ఆ ఏజెంట్ కు ఎన్నిసార్లు ఫోన్ చేసిన ఎత్తకపోవడం, అతని గ్రామానికి సైతం వెళ్ళారు. చివరకు వారు మోసపోయినట్లు తెలుసుకున్నారు. ప్రస్తుతం పని సాగక తయారు చేసే మిషన్లు నిరుపయోగంగా ఉండడంతో, మహిళలు వారి సంఘాలకు నెలనెలా డబ్బులు చెల్లించడం లేదు. సదరు అధికారి కమీషన్ల దాహంతో ప్రతి గ్రామంలో కనీసం ఐదు మిషిన్లను సంఘాలకు ఇవ్వాలని కింది స్థాయి ఉద్యోగులను కూడా ఇబ్బందులకు గురిచేసినట్లు తెలుస్తుంది.

ఇదిలా ఉండగా నెలనెలా డ్వాక్రా సంఘాల్లో మహిళలు తీసుకున్న డబ్బులు సక్రమంగా కట్టకపోతే రాత్రి, పగలు అని తేడా లేకుండా ఆయా గ్రామాలకు చెందిన మహిళా సంఘ సభ్యులను డబ్బులు కట్టని మహిళల ఇండ్ల మీదికి పంపించి, వారిని ఒత్తిడికి,ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ అధికారి గతంలో మెండోరా మండలంలో విధులు నిర్వర్తించే సమయంలో వెల్కటూర్ గ్రామంలో మహిళా సంఘ సభ్యుల డబ్బుల గోల్ మాల్ అయిన విషయంలో ఆరు నెలలు సస్పెండై ఏర్గట్ల మండలానికి బదిలీపై వచ్చిన ఇతని తీరు మారడం లేదు. సాంబ్రాణి కప్పుల విషయంలో, వత్తులు తయారు చేసే క్రమంలో మహిళలు ఆర్థికంగా నష్టపోతున్నా సదరు అధికారి దాటవేసే ధోరణిలో ఉంటూ.. ఆ విషయాన్నే పట్టించుకోకపోవడం గమనార్హం. అయితే మండల సమాఖ్య ఆఫీస్‌లో ఆఫీస్ తరపున స్వంతంగా ఉన్న సాంబ్రాణి కప్పుల మిషన్, తయారైన కప్పులే తన కమీషన్ల దాహానికి సాక్ష్యాలుగా చెప్పుకోవచ్చు. ఇచ్చిన మిషిన్లు నిరుపయోగంగా ఉండి, తయారైన వస్తువులు అలాగే ఉండడంతో నెలనెలా డబ్బులు ఎలా చెల్లించాలో తెలియక సంఘ సభ్యులు అయోమయంలో ఉన్నారు. ఇకనైనాపై అధికారులు స్పందించి తమ సమస్యను తీర్చాలని, సదరు అధికారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని గోడు వెళ్ళబోసుకుంటున్నారు.

సాధారణంగా వర్షపాతం

- మూడు రోజులుగా వర్షాలు
- తీరిన లోటు వర్షపాతం

నవతెలంగాణ-నిజామాబాద్



నాట్లు వేస్తున్న కూలీలు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా లోటు తగ్గింది. పలు మండలాల్లో వర్షపాతం సాధారణ స్థితికి చేరింది. నైరుతి ఆగమనం నుంచి జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురవలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆరుతడి పంటల వైపు కూడా మొగ్గుచూపడం లేదు. కాగా గడిచిన మూడు రోజులుగా ప్రతిరోజూ వర్షాలు కురియడంతో లోటు మండలాలన్నీ సాధారణ స్థితికి చేరాయి. నిజామాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యింది. అలాగే నవీపేట్, నందిపేట, వర్ని ~~మండలాల్లో అధిక వర్షపాతం నెలకొంది. జిల్లాలో నైరుతి రుతుపవ~~నాల కాలంలో మొత్తం 282 మిల్లీమీటర్ల వర్షపాతానికి గాను ఇప్పటి వరకు 245.7 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. అయితే ఆర్మూర్, కమ్మర్‌పల్లి, జక్రాన్‌పల్లి, రుద్రూరు తదితర 12 మండలాల్లో ఇంకా లోటు వర్షపాతం నెలకొంది. మరో మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశముంది.

అయితే కామారెడ్డిలో ఇప్పటికీ చాలా మండలాల్లో లోటు వర్షపాతం నమోదయ్యింది. 24 మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది. ఒక్క నస్రుల్లాబాద్‌లోనే అధిక వర్షపాతం నమోదయ్యింది. ఆ మండలంలో 259.6 మిల్లీమీటర్లకు గాను 365.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. 11 మండలాల్లో సాధారణ వర్షపాతం, 12 మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది.

సహ చట్టం బోర్డులు ఏర్పాటు చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



నూతన కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కార్యాలయాలు అన్ని ఒకే చోటుకి రావడంతో వచ్చిన ఫిర్యాదు దారులు, కార్యాలయంలో ఇచ్చిన వినతులను మళ్ళీ తెలుసుకు నేందుకు సమాచార హక్కు చట్టం బోర్డులను ఏర్పాటుచేయాలి. ఇప్పటికే ఎక్కువ శాఖలలో బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వచ్చిన బాధితులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ప్రతి కార్యాలయం ముందర ఆ శాఖకు సంబంధించిన సమాచార హక్కు చట్టం బోర్డు (పౌర సమాచార అధికారి, అప్పీలెటేడ్ అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లు పొందపరిచిన) ఏర్పాటు చేయాలని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి వచ్చే జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు అంటున్నారు

రేషన్‌బియ్యం త్వరగా పేదలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న నన్నేసాబ్

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని వెంటనే పంపిణీ చేసి, అర్ధాకలితో అలమటిస్తున్న నిరుపేద ప్రజలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. ఆదివారం మోస్రాలో మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతినెల 1వ తేదీన పంపిణీ చేయవలసిన ఉన్నా 15 రోజులు గడుస్తున్నా బియ్యం రాకపోవడంతో నిరుపేద ప్రజలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు త్వరతగతిన బియ్యం పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరారు. రేషన్ డీలర్ వచ్చిన బియ్యంను కొన్ని గ్రామాలలో ఇంచార్జిగా చేస్తూ కాలం వెళ్లదీయటం చేస్తే ఊరుకోబోమని సకాలంలో లబ్ధిదారులందరికీ రేషన్ బియ్యం అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మేకల మల్లేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పంపే నిధులను గుట్టుగా మింగేస్తున్న మంత్రి వేముల

- ఒక్కో పనిలో 125 శాతం కమీషన్
- ఎంపీ అరవింద్ తీవ్ర ఆరోపణలు



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

నవతెలంగాణ-వేల్పూర్

అభివృద్ధి పనులకోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను ఆర్ అండ్ బి మంత్రి ప్రశాంత్ రెడ్డి గుట్టుగా మింగేస్తున్నాడని, ఒక్కో పనిలో 125 శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఎంపీ అరవింద్ ఆరోపించారు. ఆయన ఆదివారం వేల్పూర్ బీమ్ గల్ మధ్య పెద్దవాగు మీద ఇటీవలే నిర్మిం చిన వంతెన వద్ద మీడియా తో మాట్లాడారు. ఈ వంతెన కోసం కేంద్రం 15 కోట్ల రూపాయలు మంజూరి చేసిందని ఆ నిధులతోనే వంతెన కట్టినట్టు కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం నివేదికలు సైతం పంపిందన్నారు. కానీ అదే వంతెనకు రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వార ఋణం తీసుకోని కట్టినట్లుగా శిలాఫలకాల్లో పేర్కొన్నారని అన్నారు. అంటే కేంద్రం ఇచ్చిన 15 కోట్లు మింగేసి ఆర్డీసీ నుంచి వచ్చిన దాంట్లో 25 శాతం కమిషన్ కాజేశారని అందుకే బాల్కొండ లో పనులన్నీ తమ్ముడే బినామీ పేర్ల మీద చేస్తున్నాడని ధ్వజమెత్తారు. గ్రామాల్లో మౌళిక వసతులు పెంచడానికి వంతెనలు రోడ్లు వేసుకోవడానికి కేంద్రం 50 సంవత్సరాల తర్వాత తిరిగి చెల్లించే విధంగా తెలంగాణకు నాలుగేళ్లలో రూ. 5281 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులు రాష్ట్ర ఆర్థిక స్థితి గతులతో సంబంధంలేకుండా ఇచ్చారని స్పష్టం చేసారు. ఇందులోనే జిల్లాకు 51 పనులకు గాను 318 కోట్లు మంజూరు చేసారని అర్వింద్ పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోనే 33 పనులు మంజూరు చేసారని జిల్లాలో మిగితా నియోజకవర్గాలకు మట్టికొట్టాడన్నారు.

ఊరంతా.. ఊరేగింపు

- ఎల్లారెడ్డిలో వైభవంగా పోచమ్మ బోనాలు
- అలరించిన నృత్య విన్యాసాలు
- హాజరైన స్పీకర్ పోచారం, ఎమ్మెల్యే జాజాల



బోనాల కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్, ఎమ్మెల్యే జాజాల

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ముత్యాల పోచమ్మ బోనాల పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏట ఆషాడ మాసంలో ఎల్లారెడ్డి ముత్యాల పోచమ్మ అమ్మవారికి ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పట్టణంలో 10 వార్డుల నుంచి ప్రజలు అమ్మవారికి బోనాలను ఘనంగా సమర్పించుకున్నారు. బోనాల పండుగ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఇంటి వద్ద పలహారం బండి ప్రారంభించారు. అనంతరం వీధుల నుండి పోతరాజుల విన్యాసం అమ్మవారికి బోనాలు నాట్య కళాకారులతో ఊరంతా ఊరేగింపుగా డప్పు సప్పులతో పట్టణమంతా మార్మోగిం చారు. నృత్య కళాకారుల విన్యాసాలు స్థానికులను అబ్బుర పరిచాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల జడ్పిటిసిలు ఎంపీటీసీలు ఎంపీపీలు ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్సులు చేస్తున్న మహిళలు



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

ట్రాన్స్‌కో, డిస్కమ్స్ రాష్ట్రస్థాయి ఇంటర్ సర్కిల్ పోటీలు



ప్రాక్టీస్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ ట్రాన్స్కో అండ్ డిస్కమ్స్ రాష్ట్రస్థాయి ఇంటర్ సర్కిల్ ఫుట్బాల్ అండ్ క్యారమ్స్ పోటీలు ఈనెల 18 ,19, 20 న నిజామాబాద్ ఆపరేషన్ సర్కిల్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్నారు. ఈ పోటీలను ముఖ్యఅతిథి ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి వరంగల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాలరావు ప్రారంభిస్తారు. గౌరవ అతిథులుగా జిల్లా ఇంఛార్జి పోలీస్ కమిషనర్, ఐపిఎస్ ప్రవీణ్ కుమార్, డిస్కం డైరెక్టర్స్ బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, సంధ్యారాణి, మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా కామారెడ్డి ఎస్ఈ రమేష్ బాబు, టిఎల్సి ఏస్.సూర్య నరసింహారావు, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, స్థానిక ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్.రవీందర్ అధ్యక్షత వహిస్తారు. స్పోర్ట్స్ జిల్లా సెక్రటరీ గంగారం, వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాజశేఖర్ కోశాధికారి సురేష్ కుమార్, నిజామాబాద్ జిల్లా ఫుట్బాల్ టీం అభినందించిన జిల్లా ఎస్ఈ ఆర్.రవీందర్, ఆదివారం ఉదయం పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన ప్రాక్టీస్‌లో క్రీడాకారులను అభినందించారు. కెప్టెన్ సురేష్, సీఐ ఏపీ టీఎస్ ఫుట్బాల్ టీంకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. క్రీడాకారులకు డ్రెస్సెస్ అందజేశారు. జాన్సన్ కోచ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

- జీపీ కార్మికుల సమ్మె పట్టని ప్రభుత్వం..
- దుర్గంధంతో ఇక్కట్లు పడుతున్న ప్రజలు



మార్కెట్‌లో నిండిన చెత్త



పాత బస్టాండ్‌లో పేరుకున్న చెత్తచెదారం

నవతెలంగాణ-పిట్లం

కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగులుగా గుర్తించాలని తదితర డిమాండ్‌లతో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారంతో 11వ రోజుకు చేరింది. అయినా ప్రభుత్వం పట్టనట్టే వ్యవహరిస్తుందని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. మరోవైపు జీపీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయింది. వర్షాలు కురవడంతో చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది.

పిట్లం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉండి దుర్గంధ వాసన వెదజల్లడం మూలాన ప్రజలు రోగాలు బారిన పడతమేమోనని భయ బ్రాంతులకు గురవుతున్నారు. దీనికి తోడు ఆయా గల్లీలలో శుక్రవారం నిర్వహించిన కూరగాయల సంతలో కుళ్లిపోయిన కూరగాయలు , ఆకుకూరలు , పండ్ల వ్యాపారులు వాటిని అక్కడే పారబోయడంతో నాలుగు రోజులుగా అక్కడే ఉన్నాయి. వాటిని తొలగించే వారు లేకపోయారు. పైగా వర్షం కురవడంతో అవి మరింత కుళ్ళిపోయి ఈగలు, దోమలకు ఆవాసంగా మారాయి. అటుగా నుండి కిరాణం, ఫిష్ మార్కెట్, పశువుల ఆసుపత్రికి, కూరగాయల, చిరుధాన్యాల షాపులకు వెళ్లే ప్రజలు , ఆయా గల్లీ వాసులు వాసనన భరించలేక రోగాల బారిన పడతామేమోనని భయ భ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు తగు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వట్టిపోయిన వాగుల్లోకి కాళేశ్వరం జలాలు

- కరువులో కూడా పంట పొలాలకు సాగు నీళ్లు
- ప్రతిపక్షాలు అర్థరహిత విమర్శలు మాని..
- ఇక్కడికి వచ్చి కాళేశ్వర జలాలు చూడాలి
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- చింతలూరు పెద్దవాగులోకి కాళేశ్వరం నీటి విడుదల



జలాలకు పూజచేస్తున్న మంత్రి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

వట్టిపోయిన వాగులకు జలకళ సంతరించుకుంది. వాగులోకి వస్తున్న నీటిని చూసి సీఎం కేసీఆర్ మనసారా ఆశీర్వదించండి. 20, 21 ప్యాకేజీల ద్వారా వచ్చే నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి. మేము ఇచ్చిన మాట మేరకు 20, 21 ప్యాకేజీల ద్వారా నీటిని తీసుకు వచ్చామని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం చింతలూరు వద్ద పెద్దవాగులో ప్యాకేజీ 20, 21 ద్వారా కాళేశ్వరం జలాలను రాష్ట్ర రోడ్లు భవనాలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్డీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆదివారం విడుదల చేశారు.

వివరాలు మెయిన్‌లో..

పెర్కిట్ ఊరచెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని పెర్కిట్‌లోగల ఊరు(పాత) చెరువు పునరుద్ధరణ పనులను ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల బడుగు, బలహీన పేద ప్రజల సంక్షేమానికై పెద్దపీట వేశారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్, కౌన్సిలర్ పొద్దుటూరి మురళీధర్ రెడ్డి, కామణి నరేష్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళలోనే ఫౌంటెన్ పని చేసేనా?

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



2018 ఎన్నికల సమయంలో కోర్టు చౌరస్తాలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ ప్రారంభించారు. అక్కడే చౌరస్తాలో ఉన్న కలెక్టరేట్ గ్రౌండ్ కాంపౌండ్ వాల్‌కు, డ్వాక్రా బజార్ కాంపౌండ్ వాల్‌కు రంగుల లైట్లు కూడా ఏర్పాటు చేశారు. మళ్ళీ ఎన్నికలు వస్తేనే ఫౌంటెన్ రంగు రంగుల విద్యుత్ వెలుగులు పనిచేసేనా అని నగర ప్రజలు అంటున్నారు. ఈఫౌంటెన్ కొంత కాలమే పని చేసింది. ఎన్నికలు వస్తేనే పనులు గుర్తుకు వస్తాయ అని నగర ప్రజలు అంటున్నారు.

రేపు ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట ధర్నాలు

- జయప్రదం చేయండి చేయండి
- సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకుల పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 18న నియోజకవర్గ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకుల పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను తీవ్రం చేస్తామని, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం సమావేశం నిర్వహించి జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేల క్యాంపులను ముట్టడించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర జేఏసీ ఈనెల 14న తీసుకున్న నిర్ణయాలను పాత్రికేయులకు వివరించారు. ఈనెల 18న ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలవద్ద ధర్నాలుచేసి వినతిపత్రాలు ఇవ్వాలని, 21న కలెక్టరేట్ వద్ద ప్రదర్శనలు నిర్వహించి ప్రభుత్వాన్ని మేలుకొల్పాని పిలుపునిచ్చారు. అనేక సంవత్సరాల నుంచి యెట్టి చేస్తూ, చాలీచాలని వేతనాలతో ప్రజారోగ్యం కోసం శ్రమిస్తున్న సఫాయి కార్మికుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్య వైఖరిని వీడి జేఏసీతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. 11వ పిఆర్సి జీవో నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు 15,600, కారోబార్ బిల్ కలెక్టర్ ట్రాక్టర్ డ్రైవర్లకు 19500 రూపాయలు ఇవ్వాలని పేర్కొని ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. ప్రమాద బీమా 10 లక్షలు కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిఐటియు నాయకులు జంగం గంగాధర్,. సాగర్ గంగారాం, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎండి కాజా, జేపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్మికసంఘాల నాయకులు

గంజాయితో పట్టుబడ్డ ఇద్దరు అరెస్టు

ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్

నవతెలంగాణ-ఆర్మూర్

డీపీఈవో ఆదేశాల మేరకు పట్టణ ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆదివారం పట్టణంలోని పెర్కిట్‌లో దాడులు నిర్వహించి ఆర్మూర్ పాన్‌షాపులో ఎండు గంజాయి విక్రయిస్తున్నట్టు గుర్తించి 200 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న షేక్ నయీం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ తెలిపారు. షేక్ సోఫియాన్ అనే సరఫరాదారు నుండి కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. షేక్ సోఫియాన్‌ను అరెస్టు చేయడంతోపాటు పాన్‌షాప్ యజమాని షేక్ నయీమ్‌కు సరఫరా చేస్తున్నప్పుడు వెయ్యి గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పాన్ షాప్ యజమాని మరో వెయ్యిగ్రాముల కోసం ఆర్డర్ చేయమని ఆదేశించినట్టు తెలిపారు. గంజాయిని డెలివరీ చేస్తున్నప్పుడు సరఫరాదారు షేక్ సోఫియాన్ విక్రేత షేక్ నయీమ్‌లను అరెస్టుచేసి 1.200 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు గంగాధర్, ప్రమోద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలి

పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్


నవతెలంగాణ-ఆర్మూర్

కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. ఆదివారం ఆలూర్ మండల కేంద్రంలో జరిగిన టిఫిన్ బాక్స్ బైటక్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆత్మీయ అల్పాహార బైటక్‌కు విచ్చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలు సమిష్టిగా సమన్వయంతో ముందుకెళ్తే కచ్చితంగా రాబోయే కాలంలో కాషాయ జెండా ఈ రాష్ట్రంలో ఎగరడం ఖాయమని అన్నారు. ఇందుకోసం అందరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ అల్జాపూర్ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దోళ్ల గంగారెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి నరసింహారెడ్డి, అసెంబ్లీ నాయకులు ఆలూరు విజయభారతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, కంచెట్టి గంగాధర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు అమ్దాపూర్ రాజేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్, మండల అధ్యక్షులు రోహిత్ రెడ్డి, నందిపేట్ మండల అధ్యక్షులు భూతం సాయి రెడ్డి, మాక్లూర్ మండల అధ్యక్షులు వినోద్, మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరుగుతున్న శ్రీరాంసాగర్ నీటిమట్టం

- గోదావరి నది నుంచి 13146 క్యూసెక్కుల నీరు
- ముప్కాల్ రివర్స్ పంపింగ్ నుంచి 4350 క్యూసెక్కుల నీరు

నవతెలంగాణ-మెండోర



మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల నుండి గోదావరి నది గుండా , వరద కాలువ రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు కొనసాగుతున్నట్లు ఎస్సారెస్పీ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల నుండి గోదావరి నది గుండా 13146 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా కాళేశ్వరం వరద కాలువ నుండి రివర్స్ పంపింగ్ ద్వారా 4350 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టు లోకి చేరుతుంది. జులై మాసం మొదటి తరీఖు వరకు ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరు నిలకడగా ఉండగా ప్రాజెక్టులోకి క్రమంగా వరద నీరు చేరుతుండటంతో 8 టీఎంసీల నీరు పెరిగి ఆదివారం 28.3 టీఎంసీల నీరు నిలకడగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1090 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా ప్రాజెక్టు లో 1069.70 అడుగులు 28.305 టీఎంసీల నీరు నిలకడగా ఉందని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు నుండి 343 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతుండగా అలీసాగర్ ఎత్తిపోతలకు 360 , గుత్ప ఎత్తిపోతల కు 270 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా కోరుట్ల జగిత్యాల జిల్లాకు, నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాలకు, ఆర్మూర్ మీదుగా నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల తాగునీరు విడుదల అవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

మంత్రి వేములపై బురద జల్లడం మానుకోవాలి

- బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ - వేల్పూర్



మాట్లాడుతున్న నాయకులు

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై ప్రతిపక్ష పార్టీ నాయకులు బురద జల్లడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మంత్రి చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు ఉద్దేశపూర్వకంగా వ్యక్తిగతంగా బురదజల్లే కార్యక్రమాలకు పూనుకుంటున్నారని అన్నారు. నియోజక వర్గంలో ఏం జరిగినా మంత్రిపై నింద వేయడం ప్రతిపక్ష పార్టీల వారికి అలవాటుగా మారిందని అన్నారు. నియోజక వర్గంలో మంత్రి చేసినటు అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు మంత్రిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మంత్రి ఎవరిని స్కీములు పెట్టమని చెప్పలేదని, ఈ స్కీములు వ్యక్తిగతం వ్యవహారమని, ఇందులో ఎవరికైనా నష్టం జరిగిందని భావిస్తే చట్టపరంగా ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. స్కీములు నిర్వహించి మోసం చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎవరు ఉన్నా వారికి మంత్రిద్వారా ఎటువంటి సహాయ సహకారాలు ఉండవని అన్నారు. పోలీసులు చర్యలు తీసుకోవచ్చని, వారు దోషులను నిరోపణ అయితే బీఆర్ఎస్ పార్టీ నుండి వారినీ బహిష్కరణ చేయడం జరుగుతుందని అన్నారు. స్కీం పేరుతో మోసం చేశారని మంత్రి ఇంటి వద్ద ధర్నా చేస్తామని అంటూ సహించేది లేదని తెలిపారు. సమావేశంలో ఆర్‌టీఏ మెంబర్ రేగుల్ల రాములు, ఉప సర్పంచ్ పిట్ల సత్యం, పార్టీ గ్రామ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, కుమ్మరి రాజన్న, పడాల గంగాధర్ గౌడ్, తల్ల రాజన్న, సుంకరి రాము, బీమా రాజేందర్, బీమా మోహన్ దాస్ భాస్కర్, ఇమ్రాన్, నందిపేట ప్రవీణ్ , అన్సర్, సొడ దాస్, పసుల మహేష్ , బాలకిషన్ బోయిడి పాల్గొన్నారు.

20న లోగో ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న వినయ్‌కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్, నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డాన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియం నందు డిస్ట్రిక్ట్ డాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలను ఈనెల 20న నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పసునూరి వినయ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులతో పాటు తెలంగాణ డాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ యూనియన్ మెంబెర్స్, కోరియోగ్రఫర్స్ హాజరవుతారని చెప్పారు. అనంతరం నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రగటి ఆనంద్ బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న డాన్సర్స్ డాన్స్ మాస్టర్స్ కలిసి వారి వారి గ్రూపులతో ప్రదర్శనలు ఇవ్వనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలు కళాకారులు, కవులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నవనీత, ఆదిత్య ప్రశాంత్,అమృత్, బాబి, తోట ప్రశాంత్, సోను, సాయితేజ, శ్రీకాంత్,చరిత్, గౌరవ సలహాదారులు డా.మద్దుకూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఎన్‌ఆర్‌ఐల సమస్యలపై పోరాటం చేస్తాం

- ఎన్‌ఆర్‌ఐ కువైట్ ఉపాధ్యక్షులు గున్నాల



గున్నాల విక్రమ్‌ను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

బీసీ ఎన్‌ఆర్‌ఐలకు ఎటువంటి సమస్యలు వచ్చినా వారికి అండగా ఉంటానని, ఎల్లవేళలా వారి సమస్యలపై పోరాటం చేస్తూ అండగా ఉంటానని ఎన్‌ఆర్‌ఐ కువైట్ ఉపాధ్యక్షులు గున్నాల విక్రమ్ ఆదివారం తెలిపారు. తెలంగాణ బిసి సంక్షేమ సంఘం కువైట్ అధ్యక్షులు బట్టు స్వామి, కత్తర్ ఉపాధ్యక్షులు గురాయి రాజేందర్ ఆధ్వర్యంలో నియమించినట్టు బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాస శ్యామ్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు నరేందర్ గౌడ్ ఆదేశాల మేరకు బీసీల సమస్యలకై పోరాటం చేస్తానని గున్నాల విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మల్కన్న, శేఖర్ గౌడ్, సాయన్న, గణేష్, సాగర్, అజయ్ అంకాపూర్ శ్రీ పాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న సీఎం హామీ ఏమైంది?

- గ్రామ పంచాయతీ సిబ్బంది పట్ల వివక్ష తగదు
- జీవో నెంబర్ 60 అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

గ్రామ పంచాయతీ సిబ్బంది పట్ల వివక్ష తగదని, జీవో నెంబర్ 60 వెంటనే అమలు చేయాలని, కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న సీఎం హామీ ఏమైందని సిఐటియు జిల్లా కార్యదర్శి సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పెర్కొన్నారు. ఆదివారం డిచ్‌పల్లిలో గ్రామ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె శిబిరంలో వద్ద నూర్జహాన్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు గంగాధర్ లు పాల్గొని మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే పిఆర్సి అమలు చెయ్యాలని, జీవో నెంబర్ 60 ప్రకారం క్యాటగిరి వారిగా వేతనాలను అమలు చేయాలని అన్నారు. దాదాపు తొమ్మిది మాసాల క్రితం తెలంగాణ రాష్ట్రంలో అని రంగాల కార్మికులకు పీఆర్సి వర్తింపజేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామ పంచాయతీ కార్మికులకు మాత్రం పిఆర్సి అమలు చేయకపోవడం కార్మికుల కష్టాన్ని కాలరాయడమే నని వారన్నారు. కేవలం వెయ్యి రూపాయల వేతనం పెంచి చేతులు దులుపుకోవడం కాదని 30శాతం పిఆర్సి అమలుచేసి కనీస వేతనం 26వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో అన్ని గ్రామపంచాయతీల్లో 8500 రూపాయలు ఇవ్వాల్సిన చోట 4000, 3000 వేతనాలు ఇస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని వారు దుయ్యబట్టారు. మరొకవైపు మల్టీ పర్పస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికులు ఏపని చేయాలో తెలియక గందరగోళంలో పడేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు 30శాతం పిఆర్సి అమలు చేసి కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలని లేదంటే సమ్మెను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

2011 కులగణన బహిర్గతం చేయాలి

- బీసీ విద్యార్థి సంఘం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న నాయకులు

2011లో నిర్వహించిన 15వ కులగణన బహిర్గతం చేయాలని, 16వ జనాభా లెక్కల సంబంధించిన దానిలో కూడా కులగన కాలాన్ని పెట్టాలని, కులగణన చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం తెలంగాణ యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లయినా ఇంకా బీసీ సమాజానికి సామాజిక స్వతంత్రం రాలేదన్నారు. ఎందుకంటే కులగణన చేయడం లేదని, ఎప్పుడన్నా ఆ జాతి అభివృద్ధి చెందాలన్నా.. ప్రజల అభివృద్ధి చెందాలన్నా.. ఆ ప్రజల స్థితిగతులు తెలుసుకుంటేనే వాళ్లకు ఏం చేస్తే అభివృద్ధి చెందుతారని తెలుస్తుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవడం లేదని, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఇంకా వెనుకకు నెట్టేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సరైన అవకాశాలు, సరైన న్యాయం జరగడం లేదని అన్నారు. బీసీ ప్రజలు కోరుకునేది డిక్లరేషన్లు, రిజర్వేషన్లు కాదని, అసలు మేమెంత మంది.. మాకెంతనేది ఈ జనగణన వల్లనే తెలుస్తుందని వివరించారు. కొన్ని పార్టీలు దేశంలో గరీబ్‌హటావో.. సబ్‌కాసాత్.. సబ్‌కా వికాస్ సంబ్బండ వర్గాల పేరుతో కేవలం మాటలకు పరిమితం చేస్తూ బీసీ జాతికి అన్యాయం చేస్తున్నాయని తెలిపారు.

యూనివర్సిటీలోని సమస్యలు పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నిరసన తెలుపుతున్న నాయకులు

తెలం గాణ యూనివర్సిటీలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ నాయకులు తరుణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కళాశాల ముందు విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో రోడ్ల వెంట వీధి దీపాలు లేకపోవడంతో సాయంత్రం వేళల్లో విద్యార్థులు యూనివర్సిటీ పరిసరాల్లో తిరగడానికి భయపడుతున్నారని, అలాగే హాస్టల్ రూమ్ లలో సైతం ఫ్యాన్‌లు, ట్యూబ్ లైట్ లు లేవని వాటిని వెంటనే సమకూర్చాలని కోరారు. బాలికలకు సరైన హాస్టల్ సదుపాయం లేదని, దీంతో ఒకే రూమ్‌లో సామర్థ్యానికి మించి ఉంటున్నారని తెలిపారు. వారికి వెంటనే నూతన హాస్టల్ భవనాలు నిర్మించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. తెలంగాణ యూనివర్సిటీకి నూతనంగా వచ్చిన ఇంచార్జ్ వీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు శేఖర్, విష్ణు వర్ధన్, సంతోష్ , సాయి, అజయ్, ఆశిష్, అరవింద్, అనిల్, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బోనాల పండుగ

- క్షత్రియ గోల్డెన్ సభ్యుల బోనాల సంబరాలు
- గ్రామ దేవతలకు జలాభిషేకాలు

నవతెలంగాణ-ఆర్మూర్/మోపాల్



ఆర్మూర్‌లో..



మోపాల్‌లో..

పట్టణంలోని క్షత్రియ గోల్డెన్ గ్రూప్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో ఆదివారం బోనాల సంబురాలను నిర్వహించారు. పట్టణంలోని చిన్న బజార్‌లో గల లక్ష్మీనారాయణ మందిరం వద్ద నుంచి మహిళలు, కుటుంబ సభ్యులు బోనాలు ఎత్తుకొని డప్పులు, వాయిద్యా లతో ఊరేగింపుగా గ్రామదేవతలైన ముత్యాలమ్మ, నల్ల పోచమ్మ తల్లులకు గంగ నీళ్లతో జలాభిషేకం చేశారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పోహర్ కరుణ రాజ్ కరణ్, కర్తస్ గంగామణి గణేశ్యామ్, గటడి శకుంతల కిషన్, పోహర్ జమున మోహన్, జెస్సు లలిత ఆనంద్, సాత్ పుతే మంజుల శ్రీనివాస్, పడాల్ మమత గణేష్, ఖాందేష్ సంగీత శ్రీనివాస్, బారడ్ రమాదేవి గంగా మోహన్, కర్తస్ సంధ్యా దినేష్, పోహర్ శిరీష శైలేష్, క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, క్షత్రియ సమాజ్ సమాజ్ కార్యదర్శి బారడ్ గంగా మోహన్, బొబిడే గంగా కిషన్, డాక్టర్ పవార్ విట్టల్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మోపాల్:మండలంలోని మంచిప్ప గ్రామ పరిధిలో గండి మైసమ్మ అమ్మవారికి ఆదివారం బోనాల పండుగ చేశారు. సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఇందూరు సిద్దార్థ గ్రామస్తులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పిటిసి కమల నరేష్ మండల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిద్దార్థ మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని, పాడిపంటల అభివృద్ధి చెందాలని మళ్లీ రూరల్‌కి మూడోసారి బాజిరెడ్డి గోవర్ధన్ ఎమ్మెల్యే గా ఉండాలని కోరుకున్నారు.



నిజామాబాద్‌లో..

చెరువు వరకు బీటీ రోడ్డు వేయించడం

- ఎమ్మెల్యేను కలిసిన గోవింద్‌పేట్ కాలనీవాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలోని ఎస్సీ మాల సంఘం కాలనీలో వర్షానికి రోడ్డు పూర్తిగా అధ్వానంగా గుంతల మయమైంది. జగ్జీవన్ రావ్ విగ్రహం నుండి పెద్ద చెరువు వరకు బీటీ రోడ్డు వేస్తే బాగుంటుందని, గుంతలుపడ్డ రోడ్లలో నడవడానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్సీ మాల సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు వేయిస్తానని ఏఈ ని పిలిచి ఎస్టిమేషన్ వేసి రోడ్డు పనులు మొదలు పెట్టాలని చెప్పారు. అలాగే నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న పది లక్షల మాల సంఘ భవన పనులు ప్రారంభించి పూర్తిచేయాలని, అవసరం ఉంటే ఇంకా నిధులు ఇస్తానని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాల సంఘ కుల సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, బండమీది గంగాధర్, అప్పల ఆనంద్ రెడ్డి, ఎక్స్ వైస్ ఎంపీపీ ఈ గంగాధర్, గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షులు, నర్సారెడ్డి, అప్పల గణేష్, మాజీ ఎంపీటీసీ ప్రభుదాస్, సికిందర్ సంగం పెద్ద మనుషులు ప్రతాప్, చిన్నారెడ్డి, అరుణ్, మోజెస్, సభ్యులు మోహన్, పురుషోత్తం, సందీప్, సుధాకర్, రాము, మధు, జనార్ధన్, సుశీల్, కాంతయ్య, కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు

ఆనందించు ఆలోచించు
నవతెలంగాణ
కామారెడ్డి
సోమవారం 17 జులై 2023

కందకుర్తి సరిహద్దుల్లో తనిఖీలు



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి చెక్‌పోస్ట్ వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారులు సరిహద్దు ప్రాంతాలలో ప్రత్యేక నిఘాలు ఏర్పాటు చేశారు. ఆదివారం కందకుర్తి బ్రిడ్జి సమీపంలో మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను ఆమె తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం తరలింపు, గంజాయి సరఫరా తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్టు ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఎన్జీవోస్ ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, సిబ్బంది విష్ణు, అవినాష్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



నవతెలంగాణ-రెంజల్

మహారాష్ట్రలోని బాబ్లీ గేట్లను ఎత్తివేయడంతో గోదావరిలో నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో గోదావరి, మంజీరా నదులు స్వల్పంగా ప్రవహిస్తుండటంతో గోదావరిలో నీటిమట్టం పెరుగుతుంది.

ఘనంగా బోనాల పండగ

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆషాఢమాసం సందర్భంగా పలు గ్రామాల్లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం తీసి ఊరేగించారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

బోధన్ : సాలూర మండల కేంద్రంలో ఘనంగా బోనాల పండగను నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువుతో మహిళలు ఆనవాయితీ ప్రకారం గ్రామ పోలీస్ పటేల్ వెంకట్ పటేల్ ఇంటి నుంచి బోనాలు తీసుకుని గ్రామ శివారులోని మహాలక్ష్మి, పోచమ్మ ఆలయాలకు చేరుకుని బోనం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ చంద్రకళ, గ్రామపెద్దలు బుద్దె రాజేశ్వర్, ఎంపీటీసీ సవిత వెంకటి పటేల్, కేజీ గంగారాం, ఇల్తెపు శంకర్, సురేష్ పటేల్, శివకాంత్ పటేల్, సరిడే సాయిలు, మైనపు నాగరాజు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలో ప్రజలు బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఊట్‌పల్లి, పెంటాఖుర్దు గ్రామాల్లో మహిళలు బోనాలతో తరలివెళ్లి గ్రామ దేవతలను దర్శించుకున్నారు.



బోధన్ : సాలూరా మండల కేంద్రంలో బోనాల ఊరేగింపు



బోధన్ మండలంలో..



ఎల్లారెడ్డి : పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మదన్‌మోహన్

ఆచన్‌పల్లిలో ఘనంగా బోనాలు..

బోధన్ టౌన్ : బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి గ్రామంలో బోనాల పండుగను నిర్వహించారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యాల పోచమ్మ బోనాల పండుగలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మదన్ మోహన్ ఆఫీస్ నుంచి భారీగా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోనాల పండుగలో వడ్డేపల్లి సుభాష్ రెడ్డి..

ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలో శ్రీ ముత్యాల పోచమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. బోనాల పండుగలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వన భోజనాలు..

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో వనభోజనాలకు వెళ్లారు. మండలంలోని పద్మాజీవాడి, కుప్రియాల్, దర్మారావుపేట్, తుక్కోజీవాడి, భూంపల్లి తదితర గ్రామాల్లో వనభోజనాలకు బయలు దేరారు.



బోధన్‌టౌన్ : ఆచన్‌పల్లిలో..

ఇంజనీరింగ్ వర్క్‌షాపులో పనిచేస్తున్న బాల కార్మికుల గుర్తింపు

నవతెలంగాణ-ఎడపల్లి



బాలకార్మికుడిని గుర్తించిన అధికారులు

మండల కేంద్రానికి చెందిన షేక్ అయాన్ (16) అనే బాలుడు పాఠశాలకు వెళ్లకుండా ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నట్లు సమాచారం రావడంతో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నాగేల్లి బాబు, అధికారులు మోతీరామ్, పోలీస్ కానిస్టేబుల్ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ షౌకత్ బేగం తదితరుల బృందం ఇంజనీరింగ్ షాప్‌కు ఆదివారం వెళ్లి.. షేక్ అయాన్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. ఈ బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరుస్తామని, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నాగేల్లి బాబు తెలిపారు.

బురదమయంగా కందకుర్తి పాఠశాల ఆవరణ



బురదమయంగా మారిన పాఠశాల

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి పాఠశాల ఆవరణ బురదమయం కావడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలంలో ఆవరణ మొత్తం జలమయం అవుతుంది. అప్పట్లో సంసాద్ గ్రామంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించి దత్తత తీసుకున్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పనుల నక్షను ఈ ఆవరణలోని అధికారులు ఏర్పాటు చేశారు. కానీ ఆవరణ మాత్రం అలాగే మిగిలిపోయింది. వర్షాకాలంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఈ బురద నీటి నుంచే గదిలోకి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆవరణలో మొరం పనులు చేపట్టి బురదమయం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

19వ రోజుకు రైతుల రిలే నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న రైతులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో గాంధీ విగ్రహం ఎదుట చేపట్టిన రైతుల రిలే నిరాహార దీక్ష ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. పంట పొలాలకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు కోటి 54లక్షలు మంజూరు కాగా అనివార్య కారణాలవల్ల రోడ్డు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారని రైతులు ఆరోపించారు. ఇటీవల కేవలం 20 లక్షల రూపాయల వ్యయంతో ఆ రోడ్డపై మొరం పనులను చేపట్టడానికి ముందుకు వచ్చిన ప్రజాప్రతినిధులను అడ్డుకున్నట్టు వారు పేర్కొన్నారు. 80 శాతం రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే ఈ రోడ్డపై నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రస్తుతం గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందని వారు ఆరోపించారు. మంజూరైన నిధుల మొత్తంతో రోడ్ల మరమ్మతులను చేపట్టే వరకు దీక్షను విరమించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. దీక్షలో తిరుపతి బుజ్జి, అమ్రాద్ వెంకటి, కటికల శ్రీనివాస్, వడ్డెన్న, చుక్క రాజు, దేశ్‌పెట్ పోశెట్టి, యోగేష్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌టీయూలో చేరిక

నవతెలంగాణ-తాడ్వాయి

బీఎల్‌టీయూ చేసే పోరాటాలకు ఆకర్షితులై కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డి నివాసి, కార్మిక నేత, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఇటుకల నర్సిములు జిల్లా కేంద్రంలో ఉన్న బీఎల్‌టీయూ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు సమక్షంలో ఆదివారం చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యం.ఆంజనేయులు, కామారెడ్డి జిల్లా నాయకులు, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా నసురుల్లాబాద్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రాష్ట్రంలోనే ఉత్తమ పోలీసుస్టేషన్‌గా నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్ ఎంపికైంది. ఈ మేరకు హెూంశాఖ ఏటా కొన్ని పరిమితులు ఆధారంగా రాష్ట్రంలో ఉత్తమ పోలీసుస్టేషన్లను ఎంపిక చేస్తుంది. అందులో భాగంగా నసురుల్లాబాద్ పోలీసుస్టేషన్ 2023 సంవత్సరానికి రాష్ట్రంలోనే నంబర్ 7వ స్థానంలో నిలిచింది. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో అధికారులు చేపడుతున్న కార్యక్రమాలతో రాష్ట్రంలోనే గుర్తింపు పొంది ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వ్యక్తితో మర్యాదపూర్వకంగా మాట్లాడడం, సమస్యను తెలుసుకొని పూర్తి వివరాలను రాబట్టి ఫిర్యాదు స్వీకరిస్తున్నారు. కేసులను ఛేదించి నేరస్థులకు శిక్షలు పడేలా తమదైన ముద్ర వేయడంతో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా గుర్తింపు పొందింది. పోలీస్‌స్టేషన్‌లో స్నేహపూరిత వాతావరణం, రిసెప్షన్ కౌంటర్లో మహిళా-పురుష కానిస్టేబుళ్లు అందుబాటులో ఉండి ఫిర్యాదు దారులకు సేవలందిస్తుంటారు. 100 నంబరుకు ఫోన్ చేసిన అయిదు నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకోవడం. స్టేషన్‌ల్లోని బ్లూకోల్ట్స్, పెట్రో కార్స్ అధికారుల ప్రత్యేకత. కమాండ్ కంట్రోల్ గది నుంచే సీసీ కెమెరాలను ఏర్పాటు, పోలీసు స్టేషన్‌లో దస్త్రాల నిర్వహణ క్రమపద్ధతిలో ఉంచడంతో పాటు అన్ని కోణాల్లో పరిశీలించి ఎంపిక చేసినట్లు తెలిసింది. నసురుల్లాబాద్ పోలీస్ స్టేషన్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్టేషన్‌గా గుర్తింపు పొందడం పట్ల ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఏఎస్ఐ అబిద్ బేగ్, వెంకట్‌రావు, పోలీస్ స్టేషన్ సిబ్బందికి మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు చెబుతున్నారు.



నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్

11వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : మండల కేంద్రంలోని ధర్నాచౌక్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 11వ రోజుకు చేరుకుంది. సమ్మె సందర్భంగా కార్మికులు అంగడి బజార్‌లో ఆదివారం రాత్రి నిద్రలో సమ్మె చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, స్వామి, పద్మ రాజమణి, భూమవ్వ, రాధ, గంగారామ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె 11వ రోజుకు చేరుకున్న సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్ మద్దతిచ్చి మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులు మోకాళ్ళపై కూర్చుండి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కుంట సంతోష్, శ్రీనివాస్, స్వామి, సుధాకర్, అబ్బయ్య, లక్ష్మి, లింగవ్వ, రాజమణి, అనురాధ, పోషవ్వ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు వారి న్యాయపరమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీజేపీ లింగంపేట్ మండల అధ్యక్షులు జక్సాని దత్తురాములు అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు పలికారు. సమ్మె బాట పట్టి 11 రోజులవుతున్నా ఈ ప్రభుత్వానికి చలనం రాలేదన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మహారాజ మురళి, మండల ప్రధాన కార్యదర్శి వడ్ల రామచందర్, కిషన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బొల్లారం సాయిలు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు ఉదయ్ కుమార్, మండల అధ్యక్షులు దాసరి అనిల్, పట్టణ అధ్యక్షులు మంగలి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



ఎడపల్లి : మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న నాయకులు

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు, సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై, వారి తనయులపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. ఆదివారం పలుచోట్ల రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

కోటగిరి : ఉమ్మడి మండలంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై నిరంతరం రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా రెండు పడకల గది నిర్మాణం చేపట్టిన ఘనత పోచారం అని, దేశం మొత్తం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై ఆరా తీస్తున్నారని, రైతుబంధు రైతు బీమా పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్మీ పుత్రుడుగా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పేర్కొనగా, రేవంత్ రెడ్డి తమ నాయకులపై అనాలోచితంగా మాట్లాడడం సబబు కాదని ఇప్పటికైనా పద్ధతి మార్చుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏజాస్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్- బాన్సువాడ రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాల్త్య విఠల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంది మల్లేష్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వారి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. రేవంత్ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జోలికి వస్తే రైతులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తూ, ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కిషోర్ యాదవ్, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు డివిటీ శ్రీనివాస్ యాదవ్, మహేష్, ఇమ్రాన్, కలిల్, సాయిలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి : రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



నసురుల్లాబాద్‌లో..

రేవంత్‌రెడ్డి ఖబడ్దార్

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్ (బాన్సువాడ)

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఖబడ్దార్ అంటూ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. ఆదివారం బాన్సువాడలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్.. రాజ్యాంగ బద్దమైన పదవి అది అందరికీ తెలిసిందేనని, కానీ ముందుగా పోచారం ఓ రైతు బిడ్డ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ హెూదాలో రేవంత్‌రెడ్డి రైతులకు వ్యతిరేకంగా మాట్లాడటం పట్ల ఆయన ప్రశ్నించారు. మాటకు ఇసుక మాఫియా ఆరోపణలు చేసే రేవంత్.. బాన్సువాడ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ భవనాలు, స్కూళ్లు, కాలేజీలు, డబుల్ బెడ్ రూం ఇళ్ళు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇసుకకు తమకు ఎలాంటి సంబంధం లేదని, అనవసరంగా విమర్శలు చేస్తే ఊరుకోమని అన్నారు. పోచారం సురేందర్‌రెడ్డి ప్రభుత్వ అనుమతితో అన్ని రకాల పర్మిషన్లు తీసుకుని, పన్నులు చెల్లిస్తూ క్రషర్ మిషన్ నడుపుకుంటున్నారని, నిజాయితీగా వ్యాపారం చేయడం కూడా తప్పేనా ? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ గంగాధర్, అంజిరెడ్డి, మోహన్ నాయక్, ఎజాజ్, కిష్టారెడ్డి తదితరులున్నారు.

నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి కలెక్టరేట్లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం ప్రభుత్వం బోనాల పండుగ సందర్భంగా సెలవు ప్రకటించడంతో ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్టు వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి

నవతెలంగాణ-బోధన్

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో మాజీమంత్రి టీపీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంతిరెడ్డి రాజారెడ్డి, గౌసుద్దీన్, గణపతిరెడ్డి ఉన్నారు.

బోధన్ రూరల్ ఎస్ఐ బదిలీ

నవతెలంగాణ-బోధన్

శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం పలు శాఖల అధికారుల బదిలీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బోధన్ రూరల్ ఎస్ఐగా గత 27 నెలల నుంచి విధులు నిర్వహించిన లోకం సందీప్‌ను బార్ జోన్-2లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్ఐలు నవీన్, నరేష్, సాయన్నను అదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. వీరు తక్షణమే బదిలీ అయిన పోలీస్ స్టేషన్‌లో విధులలో చేరాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం కల్దుర్కి గ్రామస్థులు రూరల్ ఎస్ఐ సందీప్‌ను ఘనంగా సన్మానించారు.

బైరాపూర్ విఠలేశ్వర్ మందిరానికి పాదయాత్ర

నవతెలంగాణ-జుక్కల్


మండలంలోని లొంగన్ గ్రామం నుంచి బీర్కూర్ మండలం బైరాపూర్ విఠలేశ్వర మందిరం వరకు గ్రామస్తుల పాదయాత్రను సర్పంచ్ నాగలగిద్దె ఉషారాణి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దలు సదుపటేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న మందులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఔషధాలు చేరుకున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనందున సీజన్‌లో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండడంతో జిల్లా వైద్యశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పెద్ద ఎత్తున ఆసుపత్రికి అన్ని రకాల మందులు వచ్చినట్లు వివరించారు. ఆస్పత్రిలో 100 పడకలను సిద్ధం చేసినట్లు, ఎలాంటి అనారోగ్యానికి గురైన అన్ని వసతులు కల్పించేందుకు ఆస్పత్రిలో అన్ని రకాల మాత్రలను ఉంచామన్నారు.

ఆకర్షించిన లిల్లీపూలు



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలోని దళితవాడలో గల సాటాపూర్ పోచయ్య ఇంటి ఆవరణంలో లిల్లీ పువ్వులు ఆకర్షిస్తున్నాయి. ఈ లిల్లీ మొక్కలు చిన్నదైనప్పటికీ పువ్వులు విరగబూస్తాయి.

జర్నలిస్టు కాలనీలో శ్రమదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు కలిసి ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీవాసులు ఉదయం రెండు గంటల పాటు శ్రమదానం చేశారు. కాలనీలోని రోడ్ నెంబర్-9లో మురుగు కాలువలను శుభ్రం చేశారు. మురుగు కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు, రాళ్ళు రప్పలను, చెత్తా చెదారాన్ని తొలగించి, పూడిక తీసి మురుగు నీరు వెళ్ళిపోయేలా చేశారు. పిల్లల ఉద్యానవనంలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు, పరిసరాలు శుభ్రం చేశారు. జర్నలిస్ట్ కాలనీని పరిశుభ్రంగా ఉంచడానికి ఎనిమిది వారాలుగా ప్రతి వారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ తెలిపారు. కాలనీ వాసులు తమ ఇళ్ళ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్లను మురుగు కాలువలలో వేయొద్దని ఆయన సూచించారు. జర్నలిస్ట్ కాలనీని ఆర్మూర్ పట్టణంలోనే ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామని అశోక్ తెలిపారు. అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు సుంకే శ్రీనివాస్, కార్యదర్శులు కొంతం రాజు, లోచారం సాయన్న, కాలనీ పెద్దలు ఎర్ర భూమయ్య, ఎల్ టీ కుమార్, జక్క లక్ష్మణ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.